వెన్న కృష్ణుడిగా.. కాళీయమర్ధనుడిగా

- భక్తులకు దర్శనమిచ్చిన యాదగిరీశుడు

వెన్న కృష్ణుడిగా స్వామివారు

యాదగిరిగుట్ట, జనవరి 13 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో అధ్యయనోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అలంకార సేవల్లో భాగంగా యాదగిరీశుడు సోమవారం ఉదయం వెన్నముద్ద కృష్ణుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం లక్ష్మీనరసింహస్వామిని ప్రధానాలయంలో కాళీయమర్ధనుడిగా అలంకరించి ఊరేగించారు. ద్రావిడ ప్రబంధ సేవా కాలంలో పారాయణిక స్వాములతో సేవోత్సవం చేపట్టారు. అనంతరం స్వామి అలంకార సేవకు హారతి నిచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ప్రధానార్చకులు నల్లన్‌ధీఘశ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, ఏఈఓలు, అర్చకులు పాల్గొన్నారు. స్వామివారిని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి దర్శించుకున్నారు.

ప్రశాంత్ చంద్రగిరికి నేషనల్ ప్రీమియం అవార్డు

ప్రశాంత్ చంద్రగిరికి అవార్డు అందజేస్తున్న హైకోర్టు జడ్జి చంద్రకుమార్

ఆత్మకూరు(ఎం), జనవరి 13 : మండలంలోని మోదుగుబావిగూడెం గ్రామానికి చెందిన ప్రశాంత్ చంద్రగిరి 2025 సంవత్సరానికి గాను బెస్ట్ సాంగ్ రైటర్‌గా ఎంపిక య్యారు. హైదరాబాద్ బొగ్గులకుంటలోని సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో నేషనల్ ప్రీమియం సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును హైకోర్టు జడ్జి చంద్రకుమార్ అందజేసి అభినందించారు. రైతులు, కార్మికుల కష్టాలను వివరిస్తూ ప్రశాంత్ పాడిన పాటలు యూట్యూబ్‌లో ఎంతో ఆదరణ పొందాయి. కార్యక్రమంలో జబర్దస్త్ కమెడియన్ షేకింగ్ శేషు, ప్రీమియం అవార్డు ఫౌండర్ మరిపల్లి రవి పాల్గొన్నారు.

కొండపైన షాపులకు అనుమతి ఇవ్వాలి

- వర్తక వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు మాధవులు

యాదగిరిగుట్ట, జనవరి 13 : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు వర్తక వెల్ఫేర్ సంఘానికి ఇచ్చిన హామీని నెరవేర్చాలని కొండపైన వర్తక వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు గడ్డమీది మాధవులు అన్నారు. యాదగిరిగుట్టలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా కొండపైన ఉన్న 112 దుకాణాలను గత ప్రభుత్వం తీసివేసిందన్నారు. ఆలయ ప్రారంభమైన తర్వాత కొండపైన 112 షాపులకు అనుమతినిచ్చి దుకాణాలు కొనసాగిస్తామని మాజీ సీఎం కేసీఆర్ హామీ నిచ్చారని తెలిపారు. అంతలోనే ప్రభుత్వం మారిందని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వ హామీని నెరవేర్చాలని కోరారు. గతంలో, ఇప్పుడు ఎమ్మెల్యేలకు లంచం ఇచ్చినట్లు వస్తున్న ఆరోపణలు సరైనవి కావన్నారు. రాజకీయాలకు సంబంధం లేకుండా కొండపైన వ్యాపారాలు కొనసాగిస్తున్నామని చెప్పారు. ఏ పార్టీతో తమకు సంబంధం లేదన్నారు. కొండపైన 112 షాపులకు అనుమతినిచ్చి మిగతా షాపులకు దేవస్థానం టెండర్ వేసుకుంటే తమకు అభ్యంతరం లేదని తెలిపారు. సమావేశంలో కొండపైన వర్తక వెల్ఫేర్ సంఘం గౌరవాధ్యక్షుడు కొన్నె రమేశ్, ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, వెంకటేశ్, బాలరాజు, కోశాధికారి నర్సింహ పాల్గొన్నారు.

భీమనపల్లిలో కబడ్డీ పోటీలు ప్రారంభం

క్రీడా పోటీల ప్రారంభంలో భాగంగా కబడ్డీ ఆడుతున్న ఎస్ఐ భాస్కర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, జనవరి 13 : సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని భీమనపల్లి గ్రామంలో భీమనపల్లి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కబడ్డీ, ముగ్గుల పోటీలు నిర్వహించారు. కబడ్డీ పోటీలను ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు క్రీడా పోటీలు దోహదపడుతాయని తెలిపారు. అనంతరం మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో భీమనపల్లి సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు కొత్త పర్వతరెడ్డి, అధ్యక్షుడు అనిరెడ్డి జగన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వడ్డమోని వెంకటేశం, ప్రధాన కార్యదర్శి కర్నాటి పాండు, కార్యదర్శి జైపాల్‌రెడ్డి, నాయకులు శేఖర్, కైలాసం, లక్ష్మిరెడ్డి, మల్లేశం, శ్రీను, శంభారెడ్డి, రాజిరెడ్డి, చంద్రవాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ముగ్గులను పరిశీలిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

భువనగిరి అర్బన్, జనవరి 13 : సంక్రాంతి పండుగ సందర్భంగా వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో జీనియస్ హైస్కూల్ ఆవరణలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. విజేతలకు వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ కృష్ణమూర్తి, ట్రెజరర్ వెంపటి శబరీనాథ్, మంచాల ప్రభాకర్, అధ్యక్షుడు మల్లగారి శ్రీనివాస్ బహుమతులు అందజేశారు.

'లక్ష డప్పుల ప్రదర్శనను జయప్రదం చేయాలి'

మోటకొండూర్‌లో డప్పు ప్రదర్శన చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మోటకొండూర్, జనవరి 13 : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ నాయకత్వంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పుల ప్రదర్శనను జయప్రదం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి మాదిగ, జాతీయ నాయకుడు మంద శంకర్‌మాదిగ అన్నారు. లక్ష డప్పుల ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో సోమవారం డప్పు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బొట్ల నర్సింహ మాదిగ, కొల్లూరి స్వామి మాదిగ, ఆడెపు శ్రీనివాస్, జయమ్మ, కొంపల్లి పరశురాం, మధు, మహేశ్, నరేశ్, సురేశ్, నరేశ్, బీసీ సంఘాల నాయకులు బుగ్గ శ్రీను, బాల్ద లింగం, బంగారి, మధు, మనోహర్ పాల్గొన్నారు.

పల్లెల్లో సంక్రాంతి సందడి

- పట్నం నుంచి గ్రామాలకు చేరిన ప్రజలు
- ఘనంగా భోగి వేడుకలు

చౌటుప్పల్ : జైకేసారంలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు, యువతులు

యాదగిరిగుట్ట, జనవరి 13 : సంక్రాంతి పండుగొచ్చింది.. సంబురాలు తీసుకొచ్చింది. ఎముకలు కొరికే చలికాలంలో పచ్చని ప్రకృతి పరవశించగా.. గ్రామాలన్నీ ప్రజలంతా ఒక్కటై సంక్రాంతి వేడుకలు జరుపుకొంటున్నారు. చదువులు, ఉద్యోగాల కోసం హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, వివిధ ప్రాంతాల్లో స్థిరపడినవారు తమ స్వంత గ్రామాలకు రావడంతో పల్లెలు కళకళలాడుతున్నాయి. రంగవల్లులతో ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొన్నది. ఆలేరు నియోజకవర్గంలోని ప్రతి పల్లె సంక్రాంతి శోభను సంతరించుకుంది. ఈ సారి పిల్లలకు వారం రోజులు పాటు సెలవులు ఇవ్వడంతో వీలైనన్ని ఎక్కువ రోజులు పల్లెల్లో ఉండటానికి సిద్ధమయ్యారు. ఇంటి ముంగిట గొబ్బెమ్మలు ఉంచి అలంకరించారు. నువ్వుల రొట్టెలు చేసుకుని ఆరగించారు. పిల్లలు గాలి పటాలు ఎగురవేస్తూ ఆనందంగా గడిపారు. యాదగిరిగుట్టలో సంక్రాంతి కళ కనిపించింది. పట్టణాల నుంచి వచ్చిన బంధువులు కొండపైకి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు.

ఆలేరు రూరల్ : మండల వ్యాప్తంగా సోమవారం భోగి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు తెల్లవారుజాము నుంచే ఇంటి ముందు ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పెట్టారు. పలు గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

రాజాపేట : మండలంలోని అన్ని గ్రామాల్లో భోగి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు సొంతూళ్లకు చేరుకోవడంతో పల్లెల్లో సంక్రాంతి శోభ సంతరించుకుంది. పిల్లలు, పెద్దలంతా వేకువజామున లేచి ఒక్క చోటకు చేరి భోగి మంటలు వేసుకున్నారు. మహిళలు ఇంటి ముంగిళ్లల్లో రంగురంగుల ముగ్గులు వేశారు. పిల్లలు, పెద్దలు కలిసి గాలిపటాలు ఎగురవేశారు.

ఆత్మకూరు(ఎం) : మండలంలోని గ్రామగ్రామాన భోగి వేడుకలను నిర్వహించారు. మహిళలు తెల్లవారుజాము నుంచి ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పెట్టి పూజించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలో నేతాజీ యువజన మండలి, శివాజీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో వేర్వేరుగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

చౌటుప్పల్‌లో భోగి మంట వేస్తున్న యువకులు

బొమ్మలరామారం : మండలంలోని అన్ని గ్రామాల్లో భోగి పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఇండ్ల ముందు రంగురంగుల ముగ్గులతో అలంకరించారు. ఫక్కీర్‌గూడలో మాజీ సర్పంచ్ మేడబోయిన గణేశ్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులుగా చీరెలు అందజేశారు.

చౌటుప్పల్ : భోగి పండుగ నేపథ్యంలో పల్లెలన్నీ సందడిగా మారాయి. భాగ్యనగరంతోపాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న ఉద్యోగులు, వ్యాపారులు పల్లెలకు చేరుకున్నారు. సొంత గ్రామాల్లో స్నేహితులతో కలిసి భోగి మంటలు వేసి సరదాగా గడిపారు. ఆడబిడ్డలు ఇంటి ముంగిట ముగ్గులతో అలంకరించారు. వివిధ సంస్థలు నిర్వహించే ముగ్గుల పోటీల్లో పాల్గొని బహుమతులు అందుకున్నారు. జైకేసారం గ్రామంలో అమరుల జ్ఞాపకార్థం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం 35వ సంక్రాంతి క్రీడోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

మోత్కూరు : మండలంలో భోగి పండుగను ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు తెల్లవారుజామున ఇంటి ముందు రంగవల్లులతో అలంకరించారు. ఆవు పేడతో గొబ్బెమ్మలను తయారు చేసి పసుపు, కుంకుమతో అలంకరించారు. అందులో గరిక, పిండి కొమ్ములను పెట్టారు. నవధాన్యాలు పోసి ప్రకృతి పూజలు చేశారు.

భువనగిరి కలెక్టరేట్ : సంక్రాంతి పండుగకు పట్టణాల నుంచి ప్రజలు పల్లెలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో సోమవారం హైదరాబాద్ – వరంగల్ 163వ జాతీయ రహదారిపై వాహనాలు ఎడతెరపి లేకుండా వెళ్లాయి. మండలంలోని రాయగిరి, జమ్మాపురం గ్రామాల వద్ద వాహనాల రద్దీ నెలకొంది. బీఎన్ తిమ్మాపురంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు.

భూదాన్ పోచంపల్లి : మండలంలో ఉదయం భోగి మంటలు వేశారు. ఇంటి ముందు రంగవల్లులను అందంగా తీర్చిదిద్ది గొబ్బెమ్మలను పెట్టారు. పిండి వంటలతో పల్లెలు ఘుమఘుమలాడాయి.

యాదగిరిగుట్ట : పాత గుండ్లపల్లిలో భోగి మంటలు వేస్తున్న కాలనీవాసులు

రామన్నపేట : కక్కిరేణిలో ముగ్గు వేస్తున్న మాజీ ఎంపీపీ జ్యోతి

భువనగిరి కలెక్టరేట్ : బీఎన్ తిమ్మాపురంలో భోగి మంటలు వేస్తున్న యువజన సంఘాల నాయకులు

ఆత్మకూరు(ఎం) : శివాజీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోటీల్లో ముగ్గులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అఖిలపక్ష నాయకులు

యాదగిరిగుట్ట : ఇంటి ముందు బసవన్నతో కళాకారుడు

ఆలేరు రూరల్ : కొలనుపాకలో ముగ్గు వేస్తున్న యువతి

రాజాపేట : ముగ్గులు వేస్తున్న మహిళలు

భూదాన్ పోచంపల్లిలో ఇంటి ముందు ముగ్గు వేస్తున్న మహిళ

కేంద్ర ప్రభుత్వ విధానాలపై రైతుల నిరసన

- నేషనల్ పాలసీ అగ్రికల్చర్ మార్కెటింగ్ కాపీల దహనం

నేషనల్ అగ్రికల్చర్ మార్కెటింగ్ కాపీలను దహనం చేస్తున్న రైతు సంఘాల నాయకులు

ఆలేరు టౌన్, జనవరి 13 : రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) పిలుపు మేరకు ఆలేరులో సోమవారం రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నేషనల్ పాలసీ ఫ్రేమ్‌వర్క్ ఆన్ అగ్రికల్చర్ మార్కెటింగ్ కాపీలను రైల్వేగేటు వద్ద దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కొల్లూరి రాజయ్య, నాయకులు మంగ నర్సింహులు, తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కెమిడి ఉప్పలయ్య మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ ప్రతిపాదనలు కార్పొరేట్‌కు అనుకూలంగా, రైతులకు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. చారిత్రాత్మక రైతాంగ ఉద్యమాలతో తిరస్కరించబడిన, మోదీ పాలనలో బలవంతంగా ఉపసంహరించబడిన మూడు పాత నల్ల వ్యవసాయ చట్టాలను తిరిగి తీసుకురావడం బ్యాక్ డోర్ వ్యూహమని విమర్శించారు. 35 పేజీల నిడివి గల పత్రంలో, చట్టబద్ధమైన కనీస మద్దతు ధర ప్రస్తావన లేదన్నారు. ఇది రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల ప్రభుత్వమని విమర్శించారు. రైతులతో ప్రధానమంత్రి చర్చించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌కేఎం జాతీయ కమిటీ పిలుపు మేరకు గణతంత్ర దినోత్సవం రోజున జిల్లా, డివిజన్ కేంద్రాల్లో ట్రాక్టర్, వాహన, మోటార్ సైకిల్ ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపారు. నిరసన ప్రదర్శనల్లో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్దన్, నాయకులు ఇక్కిరి సహదేవ్, ఆర్.సీత, ఎం.సోమయ్య, కె.అడివయ్య, రాజయ్య, బేజాడి కుమార్, వెంకటేశ్, సుదర్శన్, శ్రీకాంత్, బాలమల్లేశ్, అంజిబాబు పాల్గొన్నారు.

'యువత సేవాతత్పరత కలిగి ఉండాలి'

మంచినీటి క్యాన్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణగౌడ్

భువనగిరి కలెక్టరేట్, జనవరి 13 : యువత సేవాతత్పరతను కలిగి ఉండాలని మాజీ ఎంపీపీ అతికం లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. మండలంలోని పచ్చర్లబోడుతండాకు చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు బానోతు గోపీనాయక్ సొంత నిధులతో సమకూర్చిన మంచి నీటి క్యాన్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులకు సొంత నిధులతో మంచినీటి క్యాన్లను అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రెడ్డినాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిషేధిత మాంజా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

భువనగిరి అర్బన్, జనవరి 13 : భువనగిరి పట్టణంలో నిషేధిత మాంజాను విక్రయిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని తారకరామ్‌నగర్‌లో గల బర్రె మధు ఇంట్లో పోలీసులు సోమవారం తనిఖీలు నిర్వహించగా రెండు బ్యాగుల్లో పెద్ద రోల్స్ మాంజా, మూడు చిన్న రోల్స్ మాంజా లభ్యమయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

మాజీ ఎంపీ మందా జగన్నాథానికి నివాళి

మాజీ ఎంపీ మందా జగన్నాథం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చౌటుప్పల్, జనవరి 13 : మాజీ ఎంపీ మందా జగన్నాథం మృతి పట్ల ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద సోమవారం సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా జగన్నాథం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను పలువురు కొనియాడారు. మందా మృతి అణగారిన వర్గాలకు తీరని లోటు అని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి, మండలాధ్యక్షుడు బొడ్డు శ్రవణ్‌కుమార్, నాయకులు నకేరికంటి సతీశ్, బీమ కండ్ల శ్రీనివాస్, ఎర్ర గౌతమ్, గుడ్డేటి ప్రవీణ్, బర్రె సుధాకర్ పాల్గొన్నారు.

రాయగిరిలో పతంగుల పంపిణీ

రాయగిరిలో విద్యార్థులకు పతంగులు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ అరుణ

భువనగిరి కలెక్టరేట్, జనవరి 13 : పట్టణం పరిధిలోని రాయగిరిలో వార్డు కౌన్సిలర్ నాయిని అరుణాపూర్ణచందర్ సోమవారం చిన్నారులకు పతంగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ప్రశాంత వాతావరణంలో ఆనందాల నడుమ నిర్వహించుకోవాలని సూచించారు. జాగ్రత్తలు పాటిస్తూ పండుగను జరుపుకోవాలన్నారు. వార్డు ప్రజలు, చిన్నారులు పాల్గొన్నారు.

పుట్టపాకలో ముగిసిన క్రీడా పోటీలు

బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ జగన్

సంస్థాన్ నారాయణపురం, జనవరి 13 : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలోని పుట్టపాక గ్రామంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలు, వాలీబాల్ టోర్నమెంట్ సోమవారం ముగిశాయి. విజేతలకు ఎస్ఐ జగన్, ఎంపీటీసీ మర్రి వసంతానర్సిరెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వర్కల చంద్రశేఖర్, సీనియర్ నాయకులు దొంతగోని పెద్దులు, పిట్ట రాములు, శ్రీకాంత్, ఐతరాజు గాలయ్య, అమరేందర్, జయమ్మ, లాలయ్య పాల్గొన్నారు.

'మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి'

బీబీనగర్ ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

బీబీనగర్, జనవరి 13 : మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శులు మంద కిరణ్, లోకదాస్ పవన్ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్ ఆవరణలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ మండల కమిటీల ఆధ్వర్యంలో మహిళలకు సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం తీసుకొచ్చిన చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేసి మహిళలపై జరుగుతున్న దాడులను ఆపాలన్నారు. మహిళల రక్షణ కోసం తీసుకొచ్చిన నిర్భయ, దిశ చట్టాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలని కోరారు. నిమిషానికి 12మంది మహిళల మీద దాడులు, దౌర్జన్యాలు, వేధింపులు జరుగుతున్నా.. అనేక మంది గృహహింసకు లోనవుతున్నా బయటికి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా మహిళలపై జరుగుతున్న హింస, దాడులు ఆగడం లేదని పేర్కొన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, సీఐటీయూ క్లస్టర్ కార్యదర్శి కందాడ దేవేందర్‌రెడ్డి, నాయకులు బండారు శ్రీరాములు, పొట్ట యాదమ్మ, లోకదాస్ శ్రీధర్, బండారు భగత్, సిద్దు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

భూదాన్ పోచంపల్లి : మోహన్‌రెడ్డి కుటుంబానికి బాండ్ పత్రాలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

భూదాన్ పోచంపల్లి, జనవరి 13 : మండలంలోని కనుముక్కుల గ్రామానికి చెందిన దేవరపల్లి మోహన్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. బాల్యమిత్రుడి మృతి వార్త తెలుసుకున్న 1996–97 పోచంపల్లి జడ్పీహెచ్ఎస్ పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు సోమవారం మోహన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. రూ.1,26,000 జమ చేసి మోహన్‌రెడ్డి కుమార్తెల పేరున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. బాండ్ పత్రాలను మోహన్‌రెడ్డి భార్య దేవరపల్లి రోజాకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో రవీందర్, వెంకటేశ్‌యాదవ్, భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, అరవింద్‌కుమార్, ధనంజయ, లింగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నర్సిరెడ్డి, దయానంద్ పాల్గొన్నారు.

రాజాపేటలో ఆర్థిక సాయం

రాజాపేట : మండల కేంద్రానికి చెందిన కోటమర్తి బాలయ్య సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గంగపుత్ర సంఘం ప్రతినిధులు బాలయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.22వేల ఆర్థిక సాయం అందజేశారు.